# ఉన్నత పాఠశాలల్లో తాత్కాలిక పీఈటీలు

## 1500 మంది నియామకానికి నిర్ణయం

**ఈనాడు, హైదరాబాద్:** విద్యాబోధనకు విద్యా వాలంటీర్లను నియమిస్తున్న మాదిరిగానే సర్కారు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడల్లో తర్ఫీదు ఇచ్చేందుకు తాత్కాలిక పద్ధతిన పీఈటీలను నియమించాలని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈయేడు రెండు ఇండోర్, రెండు ఔట్‌డోర్ క్రీడలను విద్యార్థులకు పరిచయం చేయాలని వార్షిక విద్యా ప్రణాళికలోనూ పేర్కొన్నారు. దీనికోసం పిరియడ్లు కేటాయించాలనీ సూచించారు. అంతేకాకుండా ఆటలపోటీలకు సైతం ముందుగానే షెడ్యూల్‌ను ప్రకటించారు. ఆగస్టు 5లోపు పాఠశాల స్థాయిలో, 20లోపు మండల, డివిజన్‌స్థాయిలో, సెప్టెంబరు 8-20లోపు జిల్లాస్థాయిలో ఆటల పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా స్థాయి విజేతలకు సెప్టెంబరు లేదా అక్టోబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించాలి. ఈ ప్రణాళిక నేపథ్యంలోనే అన్ని ఉన్నత పాఠశాలల్లో తప్పనిసరిగా పీఈటీలు ఉండాలని భావించిన విద్యాశాఖ ప్రస్తుతం ఖాళీల లెక్కలు తీసింది. మొత్తం 4,583 ఉన్నత పాఠశాలలుండగా 1500 చోట్ల పీఈటీలు లేరు. ఈ ఖాళీలను తాత్కాలిక పద్ధతిన నియమించనున్నారు.

# 98 వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టుల భర్తీ

తెలంగాణలోని 98 వ్యవసాయ విస్తరణ అధికారుల పోస్టులు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) ద్వారా భర్తీ కానున్నాయి. గ్రేడ్-2కు చెందిన ఈ ఖాళీల భర్తీపై ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీటికి అర్హులను ప్రత్యక్ష నియామక పద్ధతిలో ఎంపిక చేస్తారు.

# బస్సు-ఆటో ఢీ... నలుగురి మృతి

**మహబూబ్‌నగర్, న్యూస్‌టుడే:** బస్సు-ఆటో ఢీకొని మహబూబ్‌నగర్ జిల్లాలో నలుగురు మృతి చెందారు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని బండ్లగేరికి చెందిన అంజమ్మ(55), ఆమె మనుమరాలు శిరీష(3), లక్ష్మమ్మ(55) ఆమె మనుమరాలు సింధూజతో పాటు గణేష్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖాజా(45), పోతన్‌పల్లికి చెందిన వెంకటయ్యలు కోడూరు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. ధర్మాపూర్ శివారుకు రాగానే వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో అంజమ్మ, శిరీష, సయ్యద్ ఖాజాలు అక్కడికక్కడే మృతి చెందగా చికిత్స నిమిత్తం తరలిస్తుండగా లక్ష్మమ్మ మృతిచెందింది. ఘటనలో గాయపడిన సింధూజ, వెంకటయ్య, ఆటో డ్రైవర్ మైబులు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు మహబూబ్‌నగర్ గ్రామీణ సీఐ రామకృష్ణ తెలిపారు. ఘటనాస్థలాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు.